క్లుప్తంగా

అగర్తిపాలెంలో రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలు



చెడుగుడు పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని అగర్తిపాలెం శివారు మామిడిగుంటలో వైఎంసీఏ 15వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. పాస్టర్ ప్రసన్నకుమార్ ప్రత్యేక ప్రార్థన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలు 11 వరకు నిర్వహించి బహుమతులు అందజేయనున్నారు. శనివారం నెల్లూరు, మామిడిగుంట–ఏ, మామిడిగుంట–బి టీమ్‌ల మధ్య పోటీలు జరిగాయి. వైఎంసీఏ కన్వీనర్ పెదపాటి సుభాకర్, అగస్టీన్, ఆర్గనైజర్లు సోడదాసి రాజశేఖర్, గోగులమండ రత్నరాజు, మాజీ సర్పంచ్ తోటి మార్టిన్ లూథర్ పోటీలను నిర్వహించారు. గంగామహేష్ తదితరులు రిఫరీలుగా వ్యవహరించారు.

వైభవంగా శివకేశవుల కల్యాణం



హోమ పూజలు నిర్వహిస్తున్న ఎంపీపీ కర్రి వెంకటనారాయణరెడ్డి,రాధ దంప

పెనుమంట్ర: మండలంలోని ఎస్.ఇల్లిందలపర్రు గ్రామంలో వేంచేసియున్న శ్రీరాజరాజేశ్వరి సమేత అగస్తేశ్వరస్వామి శ్రీసర్వమంగళాదేవి సమేత సోమేశ్వరస్వామి వార్లకు శనివారం పెనుమంట్ర ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి , రాధ దంపతుల ఆధ్వర్యంలో లక్షబిల్వార్చన, హోమ పూజలు, శివకేశవులకు కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. దయం రుద్రాభిషేకాలు అనంతరం అమ్మవార్లకు మహిళలు పెద్ద ఎత్తున కుంకుమపూజలు నిర్వహించారు. అనంతరం లక్షబిల్వార్చన హోమ పూజలు జరిపారు. సాయంత్రం శివకేశవులకు కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కొవ్వూరి వెంకటేశ్వరరెడ్డి, గీతా భువనేశ్వరి దంపతులు, సొసైటీ అధ్యక్షులు కొవ్వూరి భాస్కరరెడ్డి, మాజీ అధ్యక్షులు కర్రి శంకర శ్రీరామారెడ్డి, దేవస్థానాల ట్రస్టుబోర్డు ఛైర్మన్‌లు వనచర్ల నరశింహమూర్తి, దామిశెట్టి గాంధి, ట్రస్టుబోర్డు సభ్యులు గుబ్బల తులసీరత్నం , సానబోయిన రామకృష్ణమూర్తి, కర్రి లింగారెడ్డి పాల్గొన్నారు.

రుస్తుంబాద డ్రెయిన్‌లో తూడు తొలగింపు



తూడును తొలగింపు పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఫాజిల్

నరసాపురం రూరల్: మండలంలోని రుస్తుంబాద మురుగుకాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించే పనులు శనివారం చేపట్టారు. ఈ కాలువ వెంబడి ఉన్న పంట పొలాల్లోని ముంపు నీరు లాగకపోవడంతో రైతులు ఫిర్యాదు చేశారు. దీంతో మండవారి గర్వులో ఉన్న రుస్తుంబాద డ్రెయిన్‌లో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడు, చెత్తా చెదారాన్ని పట్టణంలోని థామస్ బ్రిడ్జి వరకూ తొలగించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు విరిగిపడిన చెట్ల కొమ్మలు నీటి ప్రవాహానికి అడ్డుగా ఉండడంతో ముంపు నీరు లాగడం లేదని గ్రహించిన తహసీల్దార్ ఫాజిల్, వీఆర్వో మిరియాల లక్ష్మీనారాయణ యంత్రం సాయంతో కాలువ ప్రక్షాళన పనులు చేపట్టారు. కార్యక్రమంలో రైతులు, కంబాల మామాజీ, సింగులూరి పిచ్చయ్య, విజయ్, రాజేష్ పాల్గొన్నారు.

సబ్‌జైలు తనిఖీ



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి కె.శ్రీనివాస్

నరసాపురం: మానవ హక్కుల పరిరక్షణకు రూపొందించబడిన చట్టాలు సవ్యంగా అమలు కావాలని నరసాపురం 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాస్ సూచించారు. శనివారం మండల న్యాయసేవాధికారసంస్థ సూచనలతో జడ్జి స్థానిక సబ్ జైలును తనిఖీ చేశారు. ఖైదీలతో మాట్లాడి వారికి జైలులో అందుతున్న వసతులపై ఆరా తీశారు. ఖైదీలకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఖైదీలకు నిర్వహించిన న్యాయ విజ్ఞన సదస్సులో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో పౌరులకు హక్కులు, బాధ్యతలు కూడా పొందిపరిచారని చెప్పారు. ఈ క్రమంలోనే ఖైదీల హక్కులకు కూడా భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. నేరప్రవృత్తి వైపు మళ్లకుండా సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఖైదీలకు సూచించారు. ఆయన వెంట జైలు సూపరింటెండెంట్ టి.అప్పారావు ఉన్నారు.

తీరంలో అభివృద్ధి మంత్రం

- ఆహ్లాదకరంగా పేరుపాలెం బీచ్
- ఆనందం వ్యక్తం చేస్తున్న సందర్శకులు



పేరుపాలెం బీచ్‌లో టూరిజం శాఖ నిర్వహిస్తున్న హంస రిసార్ట్స్



పేరుపాలెం బీచ్‌లో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్ విగ్రహం

మొగల్తూరు: జిల్లాలోనే ఆహ్లాదకరమైన సుందరమైన బీచ్‌లుగా పేరొందిన కేపీ పాలెం, పేరుపాలెం సాగర తీరాలను దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి బీచ్‌లుగా నామకరణం చేశారు. ఈ బీచ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు సందర్శకుల మనస్సులను దోచేస్తున్నాయి. పేరుపాలెం బీచ్‌లో 20 అడుగుల దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి కాంస్య విగ్రహంతో పాటు, ఆయన జీవిత విశేషాలను తెలియజేసేలా మ్యూజియం ఏర్పాటు చేయాలని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి రూ. కోటి మంజూరు చేయడంతో నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. విగ్రహాన్ని సందర్శించేందుకు వచ్చే పర్యాటకులు కూర్చునేందుకు పచ్చని లాన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే నెలలో రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ప్రారింభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

19 కిలోమీటర్ల తీర ప్రాంతం

నరసాపురం నియోజకవర్గంలో 19కిలోమీటర్ల సముద్ర తీరప్రాంతం, అహ్లాదకరమైన వాతావరణం, ప్రకృతి రమణీయమైన దృశ్యాలుతో పర్యాటకుల సందడితో పేరుపాలెం, కేపీ పాలెం బీచ్‌లు పేరుగాంచాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోనే ఏకైక బీచ్‌లైన పేరుపాలెం, కేపీ పాలెం బీచ్‌లకు 2020 బీచ్ ఫెస్టివల్ నిర్వహించిన సందర్భంగా వైఎస్సా రాజశేఖర్ రెడ్డి బీచ్‌లుగా నామకరణం చేశారు. సముద్ర తీర ప్రాంతంలో సేదతీరడానికి వస్తున్న పర్యాటకుల సందడి పెరగడంతో పర్యాటకంగా అభివృద్ధి చేయాలని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు సంకల్పించారు.

రూ.20 లక్షలతో బీచ్‌లో సౌకర్యాలు

పేరుపాలెం, కేపీ పాలెం బీచ్‌లు నిత్యం రద్దీగా ఉంటాయి. ఆదివారం అయితే సందర్శకులు భారీగా తరలివస్తారు. ఇక కార్తీకమాసం నెలరోజులు ప్రతీ ఆది, బుధవారాల్లో వేలాది మంది పర్యటకులు సముద్ర స్నానం చేసి తీరంలోని సరుగుడు తోటల్లో వనభోజనాలు చేస్తారు. దీంతో పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో పర్యటకుల సెదతీరడానికి, షెడ్లు, విద్యుత్ సౌకర్యం, మరుగుదోడ్లు వంటి సౌకర్యాలు కల్పించేందుకు రూ.20 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

బీచ్‌కు వచ్చే రహదారుల అభివృద్ధి

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బీచ్‌లకు వచ్చే పర్యాటకులకు రవాణా సౌకర్యం మెరుగుపర్చేందుకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. ఇటీవలే రూ.4.30 కోట్లతో నరసాపురం మండలం బియ్యపుతిప్ప గ్రామం నుంచి వేములదీవి, చినమైనవానిలంక, పీఎం లంక మీదుగా వయా కేపీ పాలెం, పేరుపాలెం బీచ్‌లను కలుపుతూ సముద్రం శివారు ఏటిమొగ వరుకు సుమారు 12 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ముత్యాలపల్లి, మోడి మీదుగా పేరుపాలెం బీచ్ వరకూ రూ.28 కోట్లతో రహదారి నిర్మాణం, కేపీ పాలెం మెట్రేవు నుంచి అల్లంవారిమెరక వయా పేరుపాలెం బీచ్ వరుకు రహదారి నిర్మాణం కోసం రూ.8 కోట్లు, నరసాపురం మండలం బియ్యపుతిప్ప నుంచి వేములదీవి, చినమైనవానిలంక, పీఎం లంక మీదుగా రాజశేఖరరెడ్డి బీచ్‌లను కలుపుతూ రూ.4.30 కోట్లుతో రహదారి నిర్మాణం, రూ.కోటితో 20 అడుగుల రాశేఖరరెడ్డి విగ్రహ నిర్మాణం పనులకు చీఫ్‌విప్ ప్రసాదరాజు ప్రోద్బలంతో నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

పర్యాటక అభివృద్ధికి చర్యలు



వైఎస్ రాజశేఖర్ రెడ్డి బీచ్‌లుగా నామకరణం చేసిన కేపీ పాలెం, పేరుపాలెం బీచ్‌ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. బీచ్‌లో మౌలిక వసుతుల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. బీచ్‌లకు వచ్చే పర్యాటకులకు కోసం కోట్లాది రూపాయలతో రహదారులు అభివృద్ధి చేస్తున్నాం. పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందిస్తున్నారు. – ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్‌విప్

పర్యాటకంగా అభివృద్ధి



తీర ప్రాంతంలో బీచ్‌లు కారణంగా పర్యాటకంగా అభివృద్ధి చెందడంతో పాటు ఎంతోమందికి ఉపాధి కలుగుతుంది. చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ఆధ్వర్యంలో రాష్ట్రంలో మరోసారి గుర్తింపు తీసుకువచ్చేందుకు బీచ్ ఫెస్టివల్ నిర్వహించాలని నిర్ణయించారు. – కె.రవి కుమార్, కేపీ పాలెం

చదువుపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

పాలకొల్లు అర్బన్: ఉపాధి నిమిత్తం తల్లిదండ్రులు గల్ఫ్‌దేశాలకు వెళ్లిన సందర్భంలో వారి పిల్లలు అమ్మమ్మ, తాతయ్యల వద్ద ఉంటూ చదువును నిర్లక్ష్యం చేస్తున్నారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జీఎస్ మల్లేశ్వరి అన్నారు. పాలకొల్లు మండలం ఉల్లంపర్రు రైతు భరోసా కేంద్రం వద్ద కిషోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యంగా గల్ఫ్ దేశాలకు వెళ్లిన తల్లిదండ్రుల ఆడపిల్లలకు ప్రత్యేక అవగాహన కల్పించారు. బి నాగలక్ష్మి, వడూరి పద్మ, బి.సురేఖ, ఎం.భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలి

పోడూరు: దివ్యాంగ విద్యార్థులు ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తున్న ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ విజయకుమార్ పిలుపునిచ్చారు. పోడూరు భవిత కేంద్రంలో శనివారం దివ్యాంగ బాలబాలికల తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 6నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న బధిర, అంధ విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 జి.సూర్యనారాయణ, రిటైర్డ్ హెచ్‌ఎం ఎం.నాగేశ్వరరావు, కవిటం ఎంపీటీసీ–2 కుక్కల సూరిబాబు పాల్గొన్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్ట్

యలమంచిలి: మండలంలోని అడవిపాలెం–కొంతేరు లింకు రోడ్డులో పేకాడుతున్న నలుగురిని శనివారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు ఎస్సై కాకి శివనారాయణ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.18,530 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

వయో వృద్ధునికి ఆర్థిక సహాయం

యలమంచిలి: మండలంలోని మట్లపాలెం గ్రామానికి చెందిన పొత్తూరి వెంకట సుబ్బరాజు (70) వయోభారానికి తోడు అధిక మధుమేహం, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఇటీవల సుబ్బరాజు కాలికి గాయం కావడంతో శస్త్రచికిత్స చేసి నాలుగు కాలి వేళ్లు తొలగించారు. దీంతో సుబ్బరాజు కుటుంబం వైద్యానికి, జీవించడానికి సంపాదన లేక ఆర్థిక ఇబ్బందులు పడుతుంది. స్థానికులు ద్వారా విషయం తెలుసుకున్న వసుధ ఫౌండేషన్ పాలకొల్లు శాఖ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు విషయాన్ని ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజుకు తెలపడంతో ఆయన రూ.10 వేల చెక్కు పంపించారు. ఆ చెక్కును శనివారం వసుధ ఫౌడేషన్ పాలకొల్లు శాఖ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు గ్రామ పెద్దల సమక్షంలో సుబ్బరాజుకు అందజేశారు. పి.సత్యనారాయణరాజు, ముదునూరి సురేష్‌రాజు, పి.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష తులసీదళార్చన

పెనుమంట్ర: మాముడూరు గ్రామంలో పవిత్ర గోస్తనీ తీరంలో వేంచేసియున్న శ్రీఅలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారికి శనివారం లక్ష లక్ష్మీతులసీదళార్చన పూజలు నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త భోగిరెడ్డి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఆలయ అర్చకులు వాడపల్లి సీతారామాచార్యులు పర్యవేక్షణలో ముందుగా స్వామి వారి ధ్వజస్తంభం వద్ద నూతనంగా నిర్మించిన స్వామి వారి పాదపద్మాలను కోటేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం భోగిరెడ్డి వీయమి, జ్యోతి, గంగన్న జయలక్ష్మి దంపతులు గోపూజ, గణపతిహోమం నిర్వహించారు. ఉసిరిచెట్టువద్ద దామోదరుని పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామివారికి గంధాభిషేకం, లక్షతులసీ దళార్చన, జరిగిన అనంతరం శాంతికల్యాణం జరిపారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

డ్రెయిన్ పనులు నిలిచిపోవడానికి ఎమ్మెల్యే నిమ్మలే కారణం



పాలకొల్లు అర్బన్: వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)



యలమంచిలి: అడవిపాలెంలో మాట్లాడుతున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

పాలకొల్లు అర్బన్: పట్టణంలో సగంపైగా వార్డుల్లోని మురుగునీరు పారే దమ్మయ్యపత్తి కోడు డ్రెయిన్ పనులు నిలిచిపోవడానికి ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడే ప్రధాన కారణమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) ఆగ్రహం వ్యక్తం చేశారు. సబ్ కాంట్రాక్టర్ పృథ్వీరాజ్‌ను 20 శాతం కమీషన్ అడిగిన అతను ఇవ్వలేనని చెప్పడంతో అతనిపై పోలీసు కేసు పెట్టడం వాస్తవం కాదా? ప్రశ్నించారు. పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిచాంగ్ తుపాను కారణంగా పట్టణంలో పలు వార్డుల్లో మురుగు నీరు నిలిచిపోవడంతో ఎమ్మెల్యే నిమ్మల ఆ వార్డులో పర్యటించి దమ్మయ్యపత్తికోడు డ్రెయిన్‌లో తట్టెడు మట్టి కూడా తీయలేదని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. టీడీపీ అధికారంలో ఉన్న 5 ఏళ్లలో ఎమ్మెల్యే ఏమి అభివృద్ధి చేశారో? ప్రజలకు తెలుసని గోపి ఎద్దేవా చేశారు. పాలకొల్లు నియోజకవర్గంలో పనులు చేయడానికి ఏ కాంట్రాక్టరు ముందుకు రారని, అలాగే అధికారులను కూడా భయపెట్టే నీచ, నికృష్టమైన సంస్కృతి ఎమ్మెల్యే నిమ్మలదన్నారు. ఇంటింటి ప్రచారం అంటూ ప్రజలను ఓటీపీలు చెప్పమనడంపై అనుమానంగా ఉందన్నారు. సమావేశంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేటి సూర్యనారాయణ, వెలివెల సర్పంచ్ కెల్లా సింహాచలం, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చెన్ను విజయ్, నాయకుల పెచ్చెట్టి కృష్ణాజీ, ఉనికెల శ్రీనివాస్, మండెల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

వరిపొలాల పరిశీలన

తుపాను కారణంగా వరి పంట నష్టపోయిన రైతులను, అలాగే ఇళ్లు, పశువుల పాకలు, ఇతర ఫల వృక్షాలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం అందజేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) భరోసా ఇచ్చారు. పాలకొల్లు మండలం తిల్లపూడి శివారు పాటిగరువులో తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన వరిచేలను శనివారం ఆయన పరిశీలించారు. తిల్లపూడిలో 257 కొబ్బరి చెట్లు విరిగిపోయాయని, 17 గృహాలు పాక్షికంగానూ, 19 పశువుల పాకలకు పూర్తిగా నష్టం వాటిల్లినట్లు రెవెన్యూ అధికారులు గుడాల గోపి దృష్టికి తీసుకువచ్చారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ విప్పర్తి ప్రభాకరరావు, మండల జేసీఎస్ కన్వీనర్ పార్శి వెంకటరత్నం, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నడపన కృష్ణమూర్తి, రైతులు నడపన వెంకటేశ్వరరావు, కామిశెట్టి పెద్దిరాజు, బాలం రాజారావు, బాలం ఆంజనేయులు ఉన్నారు.

జగనన్న కాలనీలో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

యలమంచిలి: అడవిపాలెం, పాలకొల్లు పట్టణ ప్రజలకు సంబంధించి అడవిపాలెంలో ఉన్న జగనన్న కాలనీ ప్రధాన రహదారి నిర్మాణానికి వెంటనే ప్రతిపాదనలు తయారు చేయమని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అధికారులను ఆదేశించారు. ఈ కాలనీలో పదుల సంఖ్యలో ఇళ్ల నిర్మాణం జరుగుతుంది. రోడ్లు సక్రమంగా లేకపోవడంతో భవన నిర్మాణ సామాగ్రి లోపలకు వెళ్లక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న గోపి శనివారం కాలనీలో పర్యటించి రోడ్లను పరిశీలించారు. ముందుగా ప్రధాన రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయమని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట చింతలపూడి, దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గాల వైఎస్సార్ సీపీ పరిశీలకులు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, హౌసింగ్ జిల్లా అధికారి రాపాక చిట్టి ఆనంద్‌కుమార్, తోట రామకృష్ణ, గుర్రాల వెంకట్రావు, డేగల సూర్యప్రభ వెంకటేశ్వరరావు, బుంగా జయరాజు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ఉండాలి



సామూహిక వ్రతాల కార్యక్రమంలో పాల్గొన్న ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పట్టణంలోని వలంధర్‌రేవులో కార్తీక మాసం పురస్కరించుకుని లక్ష్మీదేవి సామూహిక వ్రతాల కార్యక్రమంలో ఆయన పాల్గొని పూజలు చేశారు. గత 17 సంవత్సరాలుగా ప్రతీ ఏటా సామూహిక వ్రతాలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కె.కాశీవిశ్వేశ్వరరావును అభినందించారు. కార్యక్రమంలో గురు సహస్రావధాని కడిమెళ్ల వరప్రసాద్, మల్లాడి బుజ్జి, సతివాడ మార్కండేయులు పాల్గొన్నారు.

పూడిక తొలగింపు పనులు వేగవంతం



మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు తెలుపుతున్న రైతులు

పెనుగొండ: మిచాంగ్ తుపాన్‌తో వరి చేలల్లో నిలిచిపోయిన వర్షపు నీటిని తోడడానికి యుద్ధప్రాతిపదికన పనులు చేయించిన మాజీమంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. భీమలాపురంలో వరిచేలను పరిశీలించినపుడు మాజీమంత్రి శ్రీరంగనాథరాజు దృష్టికి సమస్యను రైతులు తీసుకెళ్లడంతో స్పందించి సత్వరం ఏర్పాట్లు చేయమని ఆదేశాలు జారీ చేయడంతో భీమలాపురం ఇన్‌చార్జి మొల్లేటి రామకృష్ణ ఆధ్వర్యంలో పంటకాలువల్లో పేరుకుపోయిన మట్టి దిబ్బలు, గుర్రపు డెక్క, అడ్డంకులు తొలగించడంతో వర్షపు నీరు బయటకు వెళ్లింది. దీనికి స్పందించిన రైతులు శనివారం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ముదకల నాని, పెచ్చెట్టి శ్రీను, రైతన్నలు పాల్గొన్నారు.

నడిపూడిలో డ్రెయిన్ల నిర్మాణం

పెనుగొండ మండలం నడిపూడి చింతలపాలెం డ్రెయినేజీ నిర్మాణం త్వరలోనే చేపడతామని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు భరోసా ఇచ్చారు. శనివారం నడిపూడి చింతలపాలెం మహిళలు తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును కలిసి సమస్యను విన్నవించుకున్నారు. రూ.23 లక్షలతో ప్రతిపాదనలు చేశామని, త్వరలోనే నిర్మాణాలు చేపడతామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆచంట ఏఎంసీ వైస్ చైర్మన్ గుబ్బల వీర బ్రహ్మం, నడిపూడి సర్పంచ్ కడలి బేబీ అన్నపూర్ణ, ఉప సర్పంచ్ పూరిళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు. అలాగే శనివారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజును ఆచంట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు.

తుపాను బాధితులకు రేషన్ పంపిణీ



తుపాను బాధితులకు రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ

యలమంచిలి: ప్రజా సంక్షేమమే పరమావధిగా ప్రభుత్వం పని చేస్తుందని మేడపాడు ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ అన్నారు. ఇటీవల వచ్చిన మిచాంగ్ తుపానుకు మేడపాడు ఇందిరమ్మ కాలనీలో పది ఇళ్లు మునకకు గురయ్యాయి. ఆ సమయంలో వారందరికీ స్థానిక హైస్కూల్లో ఆశ్రయం కల్పించి, భోజనాలు ఏర్పాటు చేశారు. వారి జాబితాను తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్ ప్రభుత్వానికి పంపడంతో బాధితులకు రేషన్ సరుకులు మంజూరయ్యాయి. వాటిని శనివారం ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ బాధితులకు పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, లీటరు పామాయిల్, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళదుంపలు పంపిణీ చేశారు. త్వరలోనే బాధితులందరికీ నష్ట పరిహారం డబ్బులు కూడా వస్తాయని తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్ వివరించారు. కార్యక్రమంలో వీఆర్వో తోట శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు డేగల వెంకటేశ్వరరావు, గంటా అరుణ్ కుమార్ (నాని) పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం



లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేస్తున్న దృశ్యం

నరసపాపురం: రాజీ మార్గమే రా జమార్గమని నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జి పి.విజయదుర్గ అన్నారు. నరసాపురం కోర్టులో శనివారం జాతీయలోక్ అదాలత్ నిర్వహించారు. మొత్తం 3 బెంచ్‌లు ఏర్పాటు చేసి కేసులు పరిష్కరించారు. మొత్తం 900 కేసులు పరిష్కరించారు. ఇందులో క్రిమినల్ కేసులు 808, సివిల్ కేసులు 10, ఎక్సైజ్ కేసులు 56. ప్రీలిటిగేషన్ కేసులు 23 ఉన్నాయి. కక్షిదారులు రూ 2.49 లక్షలు లబ్ధి పొందినట్టు జడ్జి విజయదుర్గ చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసులు రాజీ చేసుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయని వివరించారు. కార్యక్రమంలో జడ్జిలు, వై.శ్రీనివాసరావు, కె.శ్రీనివాస్, ఏపీపీ ఎంఏ హమీద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా దానయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: ఇరువురికీ అంగీకారమైన అప్పీలు లేని తీర్పును లోక్ అదాలత్‌లో పొందవచ్చని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్ అన్నారు. శనివారం న్యాయస్థానాల సముదాయంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జడ్జి పవన్‌కుమార్ మాట్లాడుతూ మొత్తం 175 కేసులు పరిష్కారం అవ్వగా రూ. 38,02,448లు నగదు కక్షిదారులకు పరిహారంగా అందిందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు తలుపుల శ్రీనివాసరావు, ఏపీపీ జయసింధు, ఎస్సై రవిప్రకాష్, డీఎస్పీ కొండలరావు పాల్గొన్నారు.

16 నుంచి వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివార్ల దివ్య కళ్యాణ మహోత్సవ 31వ వార్షికోత్సవం జరపనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షులు కుంపట్ల నాగశ్రీనివాస్ తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం తిరుమల తిరుపతి దేవస్థాన కల్యాణోత్సవ విగ్రహాలతో స్వామివారి కళ్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 16వ తేది నుండి 19వ తేది వరకూ పెనుమదం రోడ్డు, ఆర్ ఆర్ రైస్‌మిల్లు ప్రాంగణంలో ఈ ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు రేపూరి సూర్యనారాయణ, భీరక ప్రసాద్, చందక సత్తిబాబు, టంగుటూరి నాగేశ్వరరావు, మద్దింశెట్టి రమేష్ పాల్గొన్నారు.